# ఇది జీవితం

దిక్కుమాలిన మొగుడూ, సంసారం! ఆడదాని మొహాన తనకి తనంటూ మిగిలిన టైం అంటూ ఏం ఉంటుంది! ఆ రాత్రి పదకొండు దాటాక గాని ఆ పెద్ద ఉత్తరం విప్పి చదువుకోడానికి నాకు తీరిక అవ లేదు. మావారు అడ్డుపెడతారని కాదు, వారితో పంచుకోకుండా ఉండా లనీ కాదు. కాని, నేను ముందు చూడాలి. దాన్తో నా స్నేహం అంత పవిత్రమైనది, ప్రత్యేకమైనది, పదిలంగా దాచుకోదగ్గది!

కాసులూ నేనూ ఒక వయసు వాళ్ళమే కాక ఓ చోట చదువు కున్నాం ఎన్నో ఏళ్ళు. రాజమండ్రిలో మేం ఉన్నప్పుడు మావి పక్క పక్క ఇళ్ళు. మా ఇంట్లో నే నొక్కర్తెనే ఆడపిల్లని. బలభద్రంగారికి కూడా కాసులు ఒకే ఒక్కకూతురు.

చూశారా, అది నిజంకాదని తెలిసినా ఎలా అనేశానో కాసులు వాళ్ళ కూతురని! అందరికీ ఆ సంగతి తెలిసిందని ఆ తర్వాత మాకు తెలిసింది గాని కాసులు వాళ్ళ పెంపకపు కూతురనే విషయం ముఖ్యంగా మా ఇద్దర్నుంచీ ఎన్నేళ్ళు దాచారని!

తెలిసిన తరవాత అదొక్కటేనా, ఇద్దరం కలిసి యింకా ఎన్నెన్ని విషయాలు రాబట్టామో!

అయిదేళ్ళ కాపరం తర్వాత కూడా పిల్లలు పుట్టకపోతే బల భద్రంగారూ, రుక్మిణమ్మ అన్ని పరీక్షలూ చేయించుకున్నారట. దాంపత్య జీవితానికి అన్నివిధాలా అర్హులయినా ఒక్కొక్కప్పుడు, అరుదుగానే అనుకోండి, పురుషుడి వీర్యకణాలలో ఒక్కటంటే ఒక్కటికూడా పునరు త్పత్తికణం లేకపోయే అవకాశం ఉందిట. బలభద్రంగారి వీర్య పరీక్ష

బయట పెట్టిన కఠిన సత్యం అదే. అంటే ఆయనకి పిల్లలు పుట్టే వీలు యీ జన్మకి లేదని వైద్య పరీక్ష తేల్చింది. పెళ్ళికి ముందు వరుడి వంశ ప్రతిష్ఠో, జాతకాలో యిలాంటివి చూసుకుంటారు గాని, మన పెద్దలు పొరపాటునయినా యిలాంటి పరీక్షల జోలికి పోరుగదా! ఇది నిర్ధారించబడిన రెణ్నెల్లు దాటకుండానే కాసుల్ని దత్తతకి తీసుకున్నారు.

ఇంకేం. కాసులు పంట పండిందనుకున్నారట అంతా. వాళ్ళ కన్నతండ్రి రామావతారంగారు ఎలిమెంటరీ స్కూల్లో డ్రాయింగు మాష్టారు. తండ్రి యిచ్చిన పడిపోతున్న పాతపాకకాక ఆయన స్వశక్తితో నిలబెట్టుకున్న ఆస్తి నలుగురు ఆడపిల్లలు. కాసులు నాలుగోది. ఆ తర్వాత కూడా-వంశం నిలబెట్టడానికయితేనేం, బతికున్నన్నాళ్ళూ తండ్రిని తిట్టుకోడానికయితేనేం రామావతారంగారు ఓ పుత్రరత్నాన్ని కూడా యీ పుణ్యభూమికి ప్రసాదించకపోలేదు. ఆ తరువాతయినా వారి ప్రయత్నం వారు విరమించుకోలేదుగాని ఆయన భార్య పెట్టిన గగ్గోలుకి దద్దరిల్లి స్కూలు స్కూలంతా ఏకమై వారికి మత్తుమందు యిచ్చి శస్త్రం అడ్డువేయించారని ఆ రోజుల్లో చెప్పుకునేవారుట.

ఇలా ఎప్పుడో జరిగినవి. ఎలాంటి విషయాలయినా సరే అరమరికలు, అభ్యంతరాలు లేకుండా నాతో చెప్పేసేది, ఎంతో చనువుగా కాసులు. అంత పెద్ద యింట్లో తను ఒక్కర్తీ అవడం, మా యింట్లో నేనొక్కర్తెనే ఆడపిల్లని అవడం మమ్మల్ని మరీ దగ్గిరిగా చేర్చాయనుకుంటాను.

అసలు కాసులూ వాళ్ళ అమ్మమ్మదీ, తాతదీ అతి సామాన్యమైన కుటుంబం. పెద్ద కూతుర్ని సాగనంపేసరికి కాళ్ళు జాపేసి కళ్ళు తేలవేశారుట వాళ్ళవాళ్ళు. రుక్మిణమ్మగారి చక్కదనం ఎవరి పెళ్ళిలోనో కంటపడి ఆవిణ్ణిచ్చి పెళ్ళి చెయ్యకపోతే అలాగే వుండిపోతానని కూచున్నాడుట బలభద్రంగారు. ఎంత సాటికులస్థులయినా అంతటి నిరుపేదలతో సంబంధం కలుపుకోగలమా అని వాళ్ళ వాళ్ళు తటపటాయించినా ఆయన పట్టిన పట్టు వదల్లేదు- రుక్మిణమ్మ ఆ యింటికి కోడలుగా రాక తప్పనూలేదు. ఎటొచ్చీ పెళ్ళాం అక్క సంతానాన్ని అందునా ఆడపిల్లని దత్తత తీసు

కొనేటప్పుడు మాత్రం బలభద్రంగారికీ ఆయన తల్లిదండ్రులకీ హోరా హోరీ యుద్ధం అయిపోయింది. అప్పట్నుంచీ ఇంచుమించు వాళ్ళు విడి పోయినట్టే. ఆ క్షణంలోనే ఎవరిది వారు పంచేసుకున్నారుట. తనకి వచ్చిన సొమ్ముతో మరో ఊరు చేరి కమిషన్ వ్యాపారం ప్రారంభించిన బల భద్రంగారు చెడిపోయిందేమీ లేకపోగా కాసులుకి అయిదో ఏడు రాకుండానే ఆ వూరి పెద్ద వ్యాపారస్థుల్లో ఒకడిగా జమ అయిపోయాడు.

"మా చిట్టి మా ఇంట్లో అడుగు పెట్టిన ముహూర్తం అలాంటిది. అది ఇలా రావడమేమిటి అలా సిరి అందుకోవడమేమిటి!" అనేవాడు బలభద్రం గారు.

"అవునవును. నా బతుకులో దురదృష్టపు గడియ కూడా అప్పుడే మొదలైందని అప్పుడు నాకు తెలిసింది కాదే సుందీ!" అనేది కాసులు నాతో.

మేం అప్పుడు రాజమండ్రి దానవాయిపేటలో పోస్టాఫీసుకి ఎదు రుగా వాళ్ళ మేడపక్క పెంకుటింట్లో ఉండేవాళ్ళం. మా నాన్నగారు కూడా పెద్ద ఆఫీసరేగాని వాళ్ళ స్థాయికి బాగా తక్కువ. కిందివర్గపు పిల్లలతో కలిస్తే లేకి గుణాలు వచ్చి పాడైపోతుందని కాసుల్ని ఆ మాత్రం ఈ మాత్రం బీదపిల్లల్తో కలవనిచ్చేవారుకారు. చిన్నప్పట్నుంచీ ఎరగడం చేతో ఏమో నా రాకపోకకి మాత్రం అభ్యంతరం ఉండేది కాదు. కాసుల్తోనే కాక వాళ్ళిద్దరి దగ్గిర కూడా నాకు చనువు ఉండేది. అది వాళ్ళ మాట వినకపోతే నా చేత చెప్పించేది వాళ్ళమ్మ. మా ఇంటి పెరటివైపు చిన్న డాబా వుండేది. అది ఎక్కి అటువైపు అంచుమీద దిగి, కాస్త జాగ్ర త్తగా అందుకుంటే కాసులూవాళ్ళ మేడగది పిట్టగోడ అందేది. మా నాన్నతోపాటు బలభద్రంగారికి కూడా మనుషులకన్న డిసిప్లిన్ మీద ఎక్కువ యిష్టం కనక ఏ పరిస్థితుల్లో అయినా రాత్రి తొమ్మిది అయ్యే సరికి లైట్లు ఆర్పేసి వీధి తలుపు గడియవేసేసే వారు. అయితే రాత్రి పది దాటిన తర్వాత, పదిహేనురోజులకి ఓసారయినా ఆ యిళ్ళకు చెందిన రెండు హృదయాలు ఓచోట కలుసుకుని ఓ గంటయినా విప్పి చెప్పుకుంటే గాని ఉండలేకపోయేవని వాళ్ళెరగరు. ఈ పెంకుటింట్లోంచి ఆ మేడ గది

లోకి, ఆడపిల్లలు చదవకూడదని ఆ రోజుల్లో కట్టడి చేయబడిన ఎన్ని పుస్త కాలున్నాయో అన్నీ సరఫరా అవుతున్నాయని వాళ్ళు ఊహించి ఉండరు.

ఇంతకీ మేం స్కూల్లో ఓ బెంచీమీదే కూచుని చదువుకునే వాళ్ళం. మా నాన్నగార్ని ఎలాగో చెప్పి ఒప్పించి కాసుల్తో పాటు నన్నూ వాళ్ళ కార్లోనే కాలేజీకి పంపేవారు బలభద్రంగారు. అయితే మాతో డ్రైవర్‌గాని, స్కూల్లో టీచర్సుగాని, మధ్యలో ఆయాగాని ఎవరో ఒకరు గూఢచారిగా ఉండేవారని తెలీడానికి మాకు అట్టే రోజులు పట్టలేదు. అందుకనే, ఒకరి కంటె మరొకరం చురుకువాళ్ళమని పేరుపడిన మేము, మా మటుకు మేము అభేద్యమైన వారధి ఒకటి నిర్మించుకోక తప్పలేదు.

నేను హైస్కూల్లో చేరేనాటికే అన్నయ్య స్కూలు చదువు పూర్తయి, ఆంధ్రయూనివర్శిటీ వాల్తేరులో చేరడం జరిగింది. ఇక నాకూ తమ్ముడికీ ఏకంగా ఎనిమిదేళ్ళు తేడా. ఆడుకుని వచ్చి, ఇలా చీకటిపడే సరికి ఏదో ఓ మూల కునుకుతూ ఉండేవాడు. ఏ రాత్రికి ఆ రాత్రి వాడిని వెతికి, నిద్రలేపి బలవంతాన అన్నం తినిపించవలసిందే. మా అమ్మ ఇలా వంటిల్లు కడుగుతూ ఉంటే అలా హాల్లో గడియారం ఎనిమిది కొట్టేది. ఇంకో గంటసేపు ఫైల్సు చూచుకునేవారేమో మా నాన్న. ఆ తర్వాత మా యింట్లో మరి దీపాలుండేవికావు.

అక్కడ కాసులు అమ్మానాన్న—పడకగది ఆ మేడకింద లోపలివైపు చిట్టచివర ఉండేది. వీధిలో ఎంత గూర్ఖా ఉన్నా ఇంట్లో నిండుగా ఉన్న సరుకుకి వాళ్ళా పిలిస్తే పలికేలా అందుబాటులో ఉండే వారు. తొమ్మిది అయేసరికి వాళ్ళింట్లోనూ దీపాలు ఆర్పేసుకునేవారుగాని ఓ వేళ కరెంటు పోయినా ఉంటుందనో ఏమో వాళ్ళ పడకగదిలో ఓ లాంతరూ, పైన కాసులు గదిలో ఓ లాంతరూ బాగా ఒత్తి తగ్గించి ఓ మూల ఉంచేవారు.

మా యిల్లు ఆ వీధికి చివర ఉండడం చేతా అటువైపు ఎక్కువగా ఆఫీసులు అవడంచేతా రాత్రివేళ మా కలయిక మరొకరు పసిగట్టడానికి అవకాశం ఉండేదికాదు. అలా అని రిస్కు తీసుకుని ప్రతీ రాత్రీ కలుసు కునే వాళ్ళం కూడా కాదు. మా ఇంట్లో అందరూ పడుకున్నారని నిశ్చ యించుకున్నాక పెరట్లోకి వెళ్ళి మేడ వైపు కిటికీలోకి చూసేదాన్ని.

తలుపు తెరిచి లాంతరు అక్కడపెట్టి ఉంటే కలుసుకోమని సంకేతం. ఒత్తి పెద్దది చేసి ఉంటే అర్జెంటని అర్థం. అలా ఓ రాత్రి కనబడితే దడ దడలాడే గుండెలతో చేరుకున్నాను.

ఆ రోజే, అప్పటికి దానికి పధ్నాలుగు ఉంటాయేమో, కాసులుకి తనెవరి కూతురో తెలిసింది. అదైనా ఎప్పుడూ లేంది, దాహంవేసి కింద కొస్తే, వాళ్ళ మాటలు చెవిలో పడబట్టి.

"ఏమండీ పిల్ల పెద్దమనిషైనప్పుడైనా వాళ్ళమ్మని పిలిపించరా!"

"ఎవరి పిల్ల? తను మన కూతురుకాదని చిట్టయినా అనుకోండే గదా?"

"అయితే? మీ వాళ్ళతో ఎలాగా తెగతెంపులు చేసుకున్నారు. ఇక మావాళ్ళ తరపున అది ఒక్కర్తే. పిల్ల వ్యక్తురాలైనప్పుడైనా తల్లికి చెప్పరా!"

"చూడొసే రుక్కూ....ఇలాంటి మాట మళ్ళీ వచ్చిందంటే నీ పీక నొక్కేస్తాను. మీ అక్కా బావా అటూ ఇటూ, నువ్వూ నేనూ పీటలమీద కూచున్నప్పుడు - ఎప్పుడు - దత్తత స్వీకార సంస్కారంలో బ్రాహ్మడు మంత్రాలు చదివాడు గుర్తుందీ? దాని అర్థం జ్ఞాపకం లేదు కాబోలు, చెబుతా విను! వాళ్ళ పిల్ల చచ్చినట్టు, మళ్ళీ మనింట్లో పుట్టినట్టు. అంతే. ఆ ఛాప్టర్ క్లోజయిపోయింది. ఇంత ఆస్తి ఉంది. ఎందుకైనా మంచిదని లీగల్‌గా కూడా ఎడాప్ట్ చేసుకున్నాను. ఇక బ్రహ్మరుద్రాదులు అడ్డుపడినా అది మనింటి పిల్ల. మన పిల్ల."

"అందుకని....పాపం అది నవమాసాలు మోసి...."

"పందులూ, కుక్కలూ కూడా కంటాయి వాటికి నిర్ణయమైన మాసాలు మోసి. ఎందుకూ నలుగుర్ని కన్నాడు మీ బావ? ఇరవై ఏళ్ళ దొకర్తీ, పద్దెనిమిదేళ్ళ దొక్కర్తీ, పదిహేడేళ్ళ దొకర్తీ - ఒంటినిండా గుడ్డముక్కయినా లేకుండా వీధి మొహం చూడలేక ఆ పాకలో పడి ఏడుస్తున్నారు. కులదీపకుడొకడు తక్కువొచ్చాడు ఆ కుబేరుడికి. ఏ వీధిలో చూసినా గోళీకాయలాడుతూ ఆ వెధవే. ఈ ముష్టి పీనుగుల్ని మన మహా

లక్ష్మికి తన అక్కలూ, తమ్ముడూ అని పరిచయం చెయ్యలేదనా నీ ఏడుపు? ఏ జన్మలో ఏ నోము నోచిందో యీ బంగారు వాకిట అడుగు పెట్ట గలిగింది మన చిట్టి. అదొక్కటైనా సుఖసంపదల్లో తులతూగడం నీకు యిష్టం లేదా?"

ఇక వినలేక తన గదిలోకి వచ్చేసిందిట. ఆ ఫంక్షను అయేదాకా ఎలా ఆగిందో, ఆ రాత్రి నాతో ఎన్ని చెప్పుకుని ఎంతలా ఏడిచిందో.... మా అమ్మని అడిగి తెలుసుకోమంది. మర్నాడు నేనెవరి దగ్గిరో విన్నట్టు అడిగితే అమ్మ అంది:

"అవునే సుందీ, నువ్వు విన్నది నిజమే. రుక్మిణీ వాళ్ళ బావకి గొల్లప్రోలులో కాబోలు మేష్టరీ అని విన్నాను. దత్తతనాడే అతనికి వీళ్ళ ఏ పదివేలో ముట్టచెప్పేరని, మరి యిటువైపు చూడకూడదని కట్టుదిట్టం చేసుకున్నారనీ చెప్పుకున్నారు. ఎంత దాస్తే మాత్రం ఇలాంటి విషయాలు ఎన్నాళ్ళని దాగుతాయి! ఈ రోజుల్లో ఆయనగారు తనేం తింటున్నాడో పిల్లలకేం పెడుతున్నాడో. ఇక్కడ వీళ్ళు కాసులమ్మని ఎంత ముద్దుగా చూసుకుంటున్నారు! ఒకే కడుపున పుడితేనేం రాతల్లో ఎంత తేడాలో చూడు! అయినా రేపు పెళ్ళయి యింకో ఇంటికి పోవలసినదానివి, ఇలాంటి భోగట్టాలు నీ కెందుకే? నీకేం తెలిసినట్టు అనకు తల్లీ. లక్షాధికార్లు వాళ్ళతో మనం చాలలేం."

నేను మా అమ్మ ఆఖర్న చేసిన హెచ్చరికలో ఒక్క అక్షరమూ అమలు కాకుండా ఆ రాత్రి అన్ని సంగతులూ కాసులుకి అందజేశాను.

అంతవరకూ ఎంత తొందరగా, ఏ విధంగా వెళ్ళి తన వాళ్ళని కలుసుకుందామా అని తహతహలాడిన కాసులు, తనని కన్నవాళ్ళు పది వేలకి అమ్ముకున్నారనే వార్తతో ఎంతో షాక్ తిన్నట్టు కనిపించింది. ఆ మాట ఒక్కటీ చెప్పకుండా ఉంటే ఎంత బాగుండేది అనిపించింది. "వాళ్ళు అమ్మారు, వీళ్ళు కొనుక్కున్నారు - ఏమిటి తేడా? నా జన్మ రహస్యం దాచడానికి వీళ్ళు ప్రయత్నించడం సరే, ఇన్నాళ్ళయింది ఓ సారయినా తమ్ము కళ్ళతో చూసుకోడానికయినా నా వాళ్ళు ప్రయత్నించినట్టు లేదేం? మా వాళ్ళు అనేవాళ్ళు బతికే ఉన్నారని నా కేమిటి దాఖలా? అనే ప్రశ్న

అది పదే పదే వేస్తూంటే ఆ మొహం చూడ్డానికి భయం వేసేది. ఆ రోజుల్లోనే అనుకుంటాను, ఓసారి పొరపాటున అన్నాను.

"పాపం. ఎలాంటి అవస్థ వచ్చిందే నీకు!"

అంతే. నా చెంప ఛెళ్ళుమంది. దగ్గిరగా వచ్చి కొట్టిన చెంపని ప్రేమగా తడుముతూ అదన్నమాట జన్మలో మరచిపోలేను.

"సారీ సుందీ. ఆవేశం ఆపుకోలేకపోయాను. మంచీ చెడ్డా చెప్పుకునే ఒకే ఒక ఆప్తురాలివి నువ్వు. అయినా నా పట్ల ఎవరైనా జాలిపడితే నేను భరించలేను. నాకేం కష్టం వచ్చిందని....నాకు ఏర్పడ్డ పరిస్థితులు విషమంగా ఉన్నాయని పైకి అనిపిస్తాయిగాని, నా మటుకు నేనే ఆలోచించుకుని ఓ ప్రత్యేక వ్యక్తిగా రూపొందడానికి అవి దోహదం చెయ్యలేదా!"

ఆ సంఘటన తర్వాత కాసులు వ్యక్తిత్వంలో చాలా త్వరగా నేను ఊహించని మార్పులు కనిపించాయి నాకు. క్లాసుల్లో సరదాగా, మామూలుగానే ఉండేదిగాని వేరే రహస్యంగా రాత్రిపూట కలుసుకోడానికి ఏ మాత్రం ఉత్సాహం చూపించేది కాదు. మరి తండ్రికి ఏం నచ్చజెప్పిందో లేక దెబ్బలాట పెట్టుకుందో, మునపట్లా తొందరగా తొమ్మిది అయేసరికి దీపాలు ఆరిపోయేవి కావు ఆ యింట్లో. రాత్రి పదకొండూ పన్నెండూ అయేదాకా ఆ మేడమీది గదిలో బల్బు అలా వెలుగుతూనే ఉండేది. అన్నిటికన్నా ముందు చదువు ముఖ్యం అనుకుందో యేమో మరి! ఏమైనా అనుకోడం, ఆచరణలో పెట్టడం, అనుకున్నది సాధించి తీరడం ఈ మూడింటికి కాసులు విషయంలో పెద్ద తేడాయేం ఉండేది కాదు. ఆ మరుసటి ఏటి ఎస్సెస్సెల్సీలో ఆ అమ్మాయి స్కూల్ ఫస్టు రావడంలో ఆశ్చర్యం ఏముంది! ఆశ్చర్యం అంటూ ఉంటే ఒకటే ఒకటి. తల్లీతండ్రీ చాటున ఏదో నెమ్మదిగా గడిపినట్లు కనబడే పిల్లి ఒక్కమారు ప్రతీ చిన్న విషయానికి స్పష్టంగా గట్టిగా తన అభిప్రాయం వెలిబుచ్చడం! తల్లి గొంతుక ఎప్పుడూ వినబళ్ళేదుగాని ఆ తండ్రీకూతుళ్ళ వాదన అలా ఎప్పుడూ బయట పడిపోతూనే ఉండేది.

"నువ్వేనా చెప్పు సుందరమ్మా! పేరుకి పదహారేగాని ఏ ఇరవై యేళ్ళదానిలాగానో కనిపిస్తోంది మీ ఫ్రెండు. పోనీ విమెన్స్ కాలేజీలో

చదవమంటే తాను చదివే గ్రూపు అక్కడ లేదంటుంది. అసలే రోజులు బావులేవు. అంతదూరం ఆ మొగాళ్ళ కాలేజీకి వెళ్ళి రాకపోతే ఏమిటి నష్టం? ఇంతకీ కాలేజీలో చదివి తను ఏం చెయ్యాలి? మాకా కొన్ని తరాలకి సరిపోయే ఆస్తి ఉంది. ఇవన్నీ అనుభవించేది తను ఒక్కర్తే గదా! మూడు లక్షాధికార్ల సంబంధాలు రెడీగా ఉన్నాయి. వాటిలో తనకి కావలసిందే ఎంచుకోవచ్చు."

"చూడండి అంకుల్" అని మొదలు పెట్టి, నన్ను చూసి నాలిక కరుచుకుని, "అదికాదు నాన్నా" అని ఆరంభించింది కాసులు.

"తను వాళ్ళ కన్న కూతురు కాదని మీ స్నేహితురాలు పోల్చేసుకుందేవ్ సుండీ... వాళ్ళ వెర్రిగాని యిలాంటివి దాగుతాయా!'' అని మా అమ్మ అంతకు ముందే నాతో అనడం గుర్తొచ్చింది. ఇప్పుడు తన ప్రవర్తన చూసి నాకు ఒకలా అనిపించింది. ఏదో ఆవేశంలోనో కావాలనో తను వాళ్ళ కూతుర్ని కాదని కాసులు బలభద్రం దంపతుల ముందు - ఆ రహస్యం తన ముందు దాచవద్దని స్పష్టీకరించి వుండాలి. ఇన్నేళ్ళూ ప్రాణప్రదంగా అల్లారు ముద్దుగా అన్నీ యిచ్చి పెంచినందుకైనా తమను నలుగురి ముందూ బయటపెట్టవద్దని అతను రిక్వెస్టు చేసి ఉండాలి.

ఇంతకీ కాసులు చెప్పింది ఏమిటంటే ఎట్టి పరిస్థితులల్లోనూ తను అనుకున్న పద్ధతిలోనే చదువు సాగాలని, ఆ ఊళ్ళో అయిపోతే పై ఊరి హాస్టల్‌లోనైనా తనకి చదువుకోవాలని ఉన్నంత వరకూ అడ్డు రావడానికి ఏవిధంగానూ కుదరదని, తనంతగా తను చెప్పేవరకు తన పెళ్ళి ఊసు ఎత్తితే ఒప్పుకోనని.

అలాంటి జవాబు ఆశించక, తీరా విన్నాక తట్టుకోలేక అదే పనిగా ఆలోచిస్తూ బలభద్రంగారు కాఫీ అయినా పుచ్చుకోకుండా ఆ పడక్కుర్చీలోనే ఉండిపోయారనీ, ఆ రాత్రే ఆయనకి ఓ మాదిరి హార్ట్ ఎటాక్ లాంటిది వచ్చిందనీ, ఆ మర్నాడు మా వీధివీధంతా విడ్డూరంగా చెప్పుకున్నారు.

అయినా కాసులు ఆ తర్వాత వారం తను అనుకున్న ప్రకారం కాలేజీలో చేరక మానలేదు. అంతటి పట్టుదల ఉన్నదీ అప్లికేషను ఫారం

నింపి తండ్రి చేత సంతకం చేయిస్తున్నప్పుడు బలభద్రంగారి చూపుకి తట్టుకోలేక తలదించుకుందని వాళ్ళ గుమస్తా చెబుతూంటె విన్నాను.

ఆ ఏడాది చివర్లోనే నాకు పెళ్ళయిపోయింది. పెళ్ళికి ఎటండవడమే కాకుండా నేనిలా వచ్చేస్తూంటె మమ్మల్ని స్టేషనుకి వచ్చి దిగబెట్టింది. తీరా కాపురానికి వచ్చేశాక తెలిసింది నాకూ, కాసులకీ నిజానికి ఎంత దూరమో. తల్లిదండ్రులు చదివిస్తే చదువుకున్నాను. మానిపించి పెళ్ళి చేసి సాగనంపితే ఇలా వచ్చేశాను. నా దంటూ ఏం ఉంది! నేనో సామాన్యురాలిని. లోకంలో కొన్ని కోట్ల ఇల్లాళ్ళలో నేనొకర్తిని. ఏ ప్రత్యేకతా ఎరగని, ఏ కాంతికీ చైతన్యానికీ నోచుకోని, ఎప్పుడూ ఎవరో ఒకరి అధీనంలో పడి ఉండే ఊరూ పేరూలేని నారీమణిని—తనో?

ఉత్తరం వచ్చిందని తత్తరమైనా లేకుండా ఓ గొప్ప వ్యక్తి సన్నిహితురాలిగా, మొదట్నుంచీ మా స్నేహాన్ని ఓ తీయని తేనుపుగా సింహావలోకనం చేసుకున్నందుకు నాలో నాకే విస్మయం కలిగింది. ఒణుకుతున్న చేతుల్తో ఉత్తరం తీశాను- సుందీ.

మా నాన్నకి రాసిన ఉత్తరం కాపీ ఇందులో ఉంచాను. ముందు అది చదువు-అని మొదలైంది అది. తను చెప్పినట్టే వేరే ఆయన పేరుతో ఉన్న ఆ మడత విప్పాను.

డియర్ అంకుల్,

బియ్యేస్సీ యూనివర్శిటీ ఫస్టున నేను పాసయినట్టు రెండ్రోజుల కిందటి పేపర్లో వచ్చింది. మీరూ చూసే ఉంటారు. ఈ రెండ్రోజులూ ఆలోచించి నేనో నిర్ణయానికి వచ్చాను. నా వల్ల మీరింకా అనారోగ్యానికి గురికాకుండా నెమ్మదిగా నా అభిప్రాయాలు తెలుసుకోండి. మా నాన్న నెలల పిల్లగా ఉన్నప్పుడే నన్ను మీకు అమ్మేశాడు. ఎందుకు, తనకి డబ్బు కావాలి కనుక. మీరు కట్టుదిట్టంగా నన్ను దత్తత చేసుకోవడంతో ఊరుకోక-మావాళ్ళు అనే వారు లేనిచోట స్థిరపడి నన్ను మీ కన్నకూతురిగా అందరికీ పరిచయం చేశారు. ఎందుకు? మీకు సంతానోత్పత్తి శక్తి లేదని ఎవరూ మీ ముందు అనకూడదు గనక. దత్తత అనే విషయం దాగుతుందని మీరూ అనుకొని ఉండరుగాని మీ ముందు, మీహోదా ముందు వాళ్ళా మాట అనుకోకపోతే అదో తృప్తి. ఇక నా కోసం వచ్చిన వరులు మీరు

పెట్టిన ఇల్లరికం నిబంధనకి కూడా మారుమాటాడకుండా ఒప్పుకున్నారని తెలిసింది. ఎందుకు? వాళ్ళకి కావలసినది నేనుకాదు. నాకు మీరిచ్చే డబ్బు. అంటే నా కన్నతండ్రిగాని, నా పెంపకపు తండ్రిగాని, నా కాబోయే భర్తకి గాని నా వ్యక్తిత్వంతో మాత్రం ప్రమేయం లేదు. వాళ్ళ వాళ్ళ కోరికలు తీరడానికి నేను కేవలం ఒక సాధనం. ఈ రాత్రే నేను ఇల్లు విడిచి వెళ్ళిపోతున్నాను. నాకు నేనుగా బతకదల్చుకున్నాను. గ్రాడ్యుయేటు అయాను. నాలుగు ట్యూషన్లు చెప్పుకుంటే నా కడుపు నిండదా? ఇంకొక ముఖ్య విషయం. అవసరం పేరుతో చూపిన మీ అభిమానంతోపాటు మీరు నాకు ఇవ్వబోయే ఆస్తినికూడా తృణీకరిస్తున్నాను. ఇంకా మూడేళ్ళకుగాని నేను మేజర్ని అవను. అప్పటిదాకా నా కిష్టంలేకపోయినా నా సంరక్షణ బాధ్యత వహించే అధికారం మీకుందని విన్నాను. అంటే బలవంతంగా అయినా నన్ను పిలిపించే అధికారం మీకుంది. నా మానాన నన్ను బతక నివ్వక ఇలాంటి ఏ ప్రయత్నం చేసినా నన్ను ప్రాణాలతో వెనక్కి తీసికెళ్ళలేరనే విషయం మాత్రం మరచిపోకండి.

—కాసులమ్మ.

లక్షల ఆస్తిని కాలదన్ని తనదైన వ్యక్తిత్వానికి విలువ నిచ్చిన ఆదర్శమూర్తిని తలుచుకుంటే తన్మయత్వంతో నా కళ్ళు చెమ్మగిల్లాయి. ఎక్కడో నవలలలోనో, నాటకాలలోనో ఉంటాయి. యిలాంటి పాత్రలు. కాసులమ్మ జీవితంలో ఓ చిన్న పాత్రనయినా వహించగలిగినందుకు ఎంతో గర్వం కలిగింది నాకు.

ఉత్తరంలోని ఆ తర్వాత కాగితాలు చూస్తూంటే మాత్రం మతి పోయినంత పనయిందినాకు. నా కళ్ళని నేనే నమ్మడం కష్టమయింది. సుందీ! ఆరోజు నే నెవరి పిల్లనో నాకు తెలిసిపోయింది చూశావా, అప్పట్నుంచీ ఓ విధమైన పిచ్చి పట్టుదలా, తెగింపూ నాలో నెలకొన్నాయని నీవు గ్రహించే ఉంటావు. అంతకుముందు ఎప్పుడు నిన్ను కలుసుకుంటానా అని కొట్టుకునేదాన్ని. ఆ తర్వాత నీతో గడపడానికి కూడా యిష్టపడని ముభావం నాలో క్రమక్రమంగా ఏర్పడింది. రోజుకి మహా అయితే ఒకటో రెండో ముక్కలు నా నోట్లోంచి ఊడిపడేవి. అవయినా మా అమ్మతోనే.

నీకు గుర్తుండే వుంటుంది. కోపం పట్టలేకపోతే నాన్ననయినా అంకుల్ అని పిలిచేదాన్ని కాని మా రుక్మిణమ్మ పిన్నిని అమ్మా అని తప్ప ఇంకోలా రిఫర్ చెయ్యడానికి తిరస్కరించేది నా మనసు. మౌన గంభీరాలలో నా కంటె ఓ మెట్టు ఆమె ఎక్కువ అవడమే దీనికి కారణ మేమో! అదిగాక అంతటి ఇంటికి అన్ని రకాల పనుల పర్యవేక్షణకి అధి పతి అయినా, పదిమంది నౌకర్లకి ఒకేసారి జవాబు చెప్పవలసిన స్థితిలో ఉన్నా, ఏనాడూ ఆమె మొహాన చిరునవ్వు చెక్కు చెదరడం నేను చూడ లేదు. ఎక్కడా ఏ బడిలోనూ కాలుపెట్టే అవకాశం లేకపోయినా స్వయం కృషివల్ల తెలుగు రాయనూ, చదవనూ నేర్చుకుంది రుక్మిణమ్మ. ఎప్పుడో మరీ అలసట కలిగించే పని మీదపడితే ఎదుటివాడికి ఇబ్బంది కలిగిం చనంత తగ్గు స్వరంతో ఏ ఆదిత్య హృదయమో వల్లెవేసుకుంటూ పని చూసుకునేది మా అమ్మ....

మా కాసులు జీవితంలో ఆ తర్వాత ఏం జరిగిందో అని నా మనసు ఆతృత పడుతూంటే మధ్య హఠాత్తుగా ఈ రుక్మిణమ్మ వర్ణన దేనికి? దీనికేం మతి పోలేదు కదా అనిపించింది నాకు. ఆ తర్వాత ఉత్తరం చూస్తే నాకే అంతవరకూ మతిపోయిందని స్పష్టమయింది!

'సరే, నాన్నకి రాసిన ఉత్తరం కాపీ చదువుకున్నావు కదా. దాని ఒరిజినల్ చేత్తో పట్టుకున్నాను. తలుపు చప్పుడు చెయ్యకుండా వాళ్ళ గది తలుపు తీశాను. అప్పుడు రాత్రి ఏ పదకొండో అయి వుంటుంది. రెండిం టికి ట్రెయినుంది. మన క్లాస్‌మేట్ మేరీ నీకు గుర్తుందిగా. ఇలా పరీక్షలు అయిపోయాయో లేదో అలా దానికి విజయవాడలో ఏదో కాన్వెంటులో జాబ్ వచ్చిందని ఆ మధ్య రాసింది. ముందు అక్కడికి వెళ్ళిపోతే తర్వాత ఆలోచించుకోవచ్చని అప్పటికి నిశ్చయించుకున్నాను. ఆ బెడ్ లైట్ వెలుగులో ఓ మంచంమీద అటు తిరిగి పడుకోడం కనిపించింది, అంతేకాదు ఆయన గుర్రు వినిపించింది. ఇక ఆలస్యం చెయ్యకుండా నేను తెచ్చిన కాగితం మడత ఆ టేబుల్‌మీద ఎదురుగా పెట్టి ఎగిరి పోకుండా వక్కపొడి డబ్బా వెయిట్ పెట్టాను. వచ్చేస్తూ ఇటు తిరిగాను. ఇటు తిరిగి అమ్మ పడుకున్నట్టుంది. ఆ గోడ చివరికి జరిపిన యింకో మంచం మీద. ఒక్కనిముషం గుండె ఆర్ద్రమయింది. నన్ను నేను నిలదొక్కుకుని

ఎలాగో నా గదికి చేరుకున్నాను. అన్ని నగలూ ఎప్పుడో తీసేసి దాచే శాను బీరువాలో. కట్టుకున్న చీరకాక రెండే రెండు జతలూ ఓ ఏభై రూపాయలూ పట్టుకున్నాను. ఎంత తొందరగా సూట్ కేసులో పెట్టుకుందా మన్నా నాకు నిత్యం అవసరమయ్యే వస్తువులు వెతికి అమర్చుకునేసరికి ఓ అరగంట అయిందేమో. ఓ చేత్తో తలుపు దగ్గరగా వేసి మరో చేత్తో సూట్ కేసు పట్టుకుని ఇటు తిరిగాను. మా అమ్మ!

ఆమె ఓ చేతిలో నేను రాసి ఉంచిన ఉత్తరం ఎగురుతోంది. మరో చేత్తో కళ్ళజోడు తీసేసి బల్లమీద పెట్టింది. నా కుడి చెయ్యి పట్టుకుంది. 'ఆ పెట్టె అక్కడ పెట్టెసి నా తోరా' అని సౌంజ్ఞ చేసింది. నేను కాస్త ఆలస్యం చేస్తే బర బరా లాక్కు వెళ్ళునేమో! అలా ఉన్నాయి ఆ చూపులు. ఆ అవసరం లేకుండానే మంత్ర ముగ్ధలా ఆవిడిని అనుసరించాను. పై డాబామీదికి తీసుకెళ్ళింది. నేను చూస్తూండగానే చేతిలో ఉత్తరం ఇంతింత ముక్కలుగా చింపి గాలిలోకి విసిరేసింది. డాబా చివర మూలకి నన్ను పిలిచింది. అక్కడ ఎత్తుగా మా మేడకంతటికీ నీళ్ళు సప్లయి చేసే పెద్ద సిమెంటు టాంకు ఉంది. దాన్ని ఏ నెలకో ఓ సారి కడిగిస్తూ ఉంటారు. అక్కడికి చేరడానికి ఓ ఇనప నిచ్చెన ఉంది.

ఇంకా చూస్తావేమే! ఆ నిచ్చెన ఎక్కు. అక్కణ్ణుంచి కళ్ళు మూసుకుని కిందకు ఉరుకు. మళ్ళీ మాటాడకుండా చావు. నెలల పిల్లని తీసుకొచ్చి ఇరవై ఏళ్ళు నా చేతుల్తో నేను పెంచినందుకు నా కిలాంటి శిక్ష జరగవలసిందే!

ఎంత ఆపుకుందామన్నా ఆమె కన్నీళ్ళు ఆగినట్టు లేదు. కూలబడి గొల్లుమంది. అలా ఎందుకు చేశానో ఇప్పుడు చెప్పలేను. మరుక్షణం మళ్ళీ పసిపిల్లనై ఆమె ఒడిలో తలదాచుకున్నాను.

నా తల నిమురుతూ, ఆ గుడ్డి వెన్నెలలో నా కళ్ళలోకి చూస్తూ అప్పుడప్పుడు ఆగుతూ, అమ్మ చెప్పిన మాటల సారాంశం ఇదీ:

"నువ్విలా ఉత్తరం రాయనక్కర్లేదు. ఏదో మాటల సందర్భంలో రోజుకోసారి ఎక్కడికో పోయి నీ బతుకు నువ్వు బతుకుతావని సూచిస్తూనే ఉన్నావు. అలా వద్దనీ, నీ యిష్టప్రకారం యిక్కడే బతకొచ్చనీ ఆయన ఎన్నిసార్లు చెబుదామన్నా నువ్వు చెప్పనివ్వలేదు. ఎందుకంటే—

ఆయన్ని నువ్వు నమ్మలేదు గనక. ఇరవై ఏళ్ళు పెంచినా నీలో ఆనమ్మకం కలిగించలేదంటే మాలోనే ఏదో లోపం ఉండి ఉండాలి. ఇలా జరిగిందంటే ముఖ్యంగా ఆయనే బాధ్యత వహించవలసి ఉంటుంది. ఎందుకంటే నిన్ను పెంపకానికి తీసుకున్ననాడే ఆయన ఓ నిబంధన పెట్టారు. మీ అమ్మా, నాన్నా, అక్కలూ వాళ్ళ సంగతి ఆ క్షణంలోనే తుడిచిపెట్టుకుపోవాలి. అది సహజమే. పెంపకానికి తీసుకున్న ఎవరైనా అలాగే అనుకుంటారు. అదికాదు. అంతకంటె క్రూరమైన నిబంధన ఒకటి విధించారు. నీ ఎదుగుదలలో నా ప్రభావం కూడా ఏ మాత్రం పనికిరాదు! అందుకనే నీకు మూడో ఏడు నిండగానే అక్కడే ఉండి చదువుకొనేలా, ఊళ్ళోనే ఉన్న కాన్వెంటుకి పంపేశారు నిన్ను. అలా పంపేశారేగాని ఏ రోజుకారోజు నిన్నోసారి వచ్చి చూడకుండా ఉండలేకపోయేవారు ఆయన. అలా నాలుగైదేళ్ళు అవనిచ్చి ఉన్నట్టుండి నిన్నోసారి యింటికి తీసుకొచ్చేశారని నీకు తెలుసు. కాని ఎందుకో ఎరగవు, అలా పైన వదిలేస్తే, జ్ఞానమొస్తున్న పిల్లకి తను ఎవరో ఎవరైనా ఊదేసె అవకాశం ఉంటుందని ఆయన ఫ్రెండ్ ఎవరో చెప్పారుట. ఇంటికి తెచ్చినా, ఆ క్షణం నువ్వు ఏది కోరితే అది అందించేటంత ముద్దుగా చూసుకున్నా, అందుకే నిన్ను నీ మటుకు వదిలెయ్యకుండా ఓ విధమైన క్రమశిక్షణలో పెట్టారు. ఆయన నన్నో వ్యక్తిగా ఎప్పుడూ గుర్తించినదీ లేదు, నా మాట విన్నదీ లేదు. అయినా నా పాట నేను మానలేదు. 'దాని జన్మరహస్యం దాచే వెర్రి ప్రయత్నం మీరు మానెయ్యండి. ఏదో ఓ రోజు మీరే కూచోపెట్టి చెప్పెయ్యండి. అదీ పెద్దదౌతోంది' అని ఎంతగా మొరపెట్టుకున్నా విన్నారు కాదు. ఎందుకో తెలుసా? తనది కాని వస్తువుని తనది అనిపించుకుందామనే వెర్రి భ్రాంతి! ఆయనా, నువ్వూ తప్ప అందులో నేను కూడా ప్రవేశించడానికి వీల్లేనంత గుడ్డి ప్రేమ! ఓ వేళ మీ నాన్నే నిన్ను ఒకర్తినే కని, యింత గొప్పవాడు అయి, యీ విధంగా పెంచితే, యీ పరిస్థితిని ఎదుర్కోక తప్పేది కాదని నా నమ్మకం. నా కడుపు పండక మాతృత్వం అంటే నేనైతే అనుభవించలేదుగాని ఓ అమ్మ కడుపులోంచే నేనూ వచ్చాను. ఆ చల్లదనం ఎలాంటిదో నేను ఊహించలేనిది కాదు. అయినా అలాంటి వంద మాతృత్వాలు కట్టకట్టినా ఆయన నీ పట్ల చూపిన శ్రద్ధాభిమానాల గోటికి సాటిరావని ఆ

దేవుడి ముందైనా నేను సాక్ష్యం ఇవ్వగలను. ఆయన బతుకంతా పరచిన వెన్నెల నువ్వే అనుకున్నా, రోజంతా నీ గురించే ఆలోచించినా, ఇన్నేళ్లూ ఆ వ్యాపారం చూసుకోడంలోనైనా కొంత కాలం గడిచిపోయేది. నీకా సంగతి తెలిసిపోయి ఎప్పుడయితే విదుల్చుకున్నావో, ఆనాడు మంచాన పడిన ఆయన మనసు మరి కోలుకోలేదు. రెండేళ్ళయి అన్ని వ్యవహారాలూ మూలబడ్డాయని నీకు తెలుసు. పెంచి ప్రేమించినవాళ్ళే గుండెను దెబ్బతీస్తే అది దినదినం క్రుంగి కృశించక ఏమౌతుంది! అయినా చూస్తూ ఊరుకోలేకపోయాను. 'మీరు మొగవాళ్ళు. ఆలోచన తప్ప ఆర్ద్రతకి చోటు లేదు మీలో. మరొకరి నీడయినా పడనియ్యక మీ కూతుర్ని మీలాగే మొగాడిలాగ పెంచారు. మేధ వికసించిందిగాని దాని హృదయం ఎదగ లేదు. ఆడదాన్ని, నన్ను దాన్తో మాట్లాడనివ్వండి. ఎంతైనా అది మా అక్క కూతురు. నా మాట కాదనదు' అని చెప్పబోయాను. అయితే ఆ తొందర్లో 'మా అక్క కూతురు' అనే వాడకూడని మాట వాడేను. ఆయన ఇంతెత్తున లేచారు. 'ఇది మేమిద్దరం తేల్చుకోవలసిన వ్యవహారం. మధ్యని నువ్వెవరు, మీ అక్కెవరు? నువ్విందులో జోక్యం కలుగజేసుకున్నావా, ఈ గుప్పెడు నిద్రమాత్రలూ మరి చడీ చప్పుడూ లేకుండా నా కడుపులోకి వెళ్ళిపోతాయి. ఇదే ఆఖరిసారి చెప్పడం' అన్నారు. అయితే ఇవాళ ఇన్నీ తెలిసి ఎందుకొచ్చావని నువ్వు అడగొచ్చు. చెబుతా విను!"

కొంగుతో మొహం తుడుచుకుని మా అమ్మ మరోసారి చెప్పింది. "చెప్పేనుకదా మెదడు చురుకుగా పనిచెయ్యడంలో మీరిద్దరూ ఒకరితో ఒకరు పోటీ అని. ఇవాళో, రేపో ఇంటి నుంచి దాటెయ్యడానికి నువ్వు ఏర్పాట్లు చేస్తున్నావని ఎలా పసిగట్టారో ఆ చురుకుబుద్ధి ఇట్టే పోల్చుకుంది. ఇవాళ మధ్యాహ్నంనుంచీ ఆయన అదోలా ఉన్నారు. కవర్లోంచి ఏదో తీసుకుని పదేపదే చూసుకుని మళ్ళీ లోపల పెట్టేస్తున్నారు నాకు కనపడకుండా. నా గుండె దడదడ లాడింది. వీలునామా మళ్ళీ మార్చారా? నాకేదయినా ఆఖరి సందేశమా! ఏమైతే అయిందని వెనకనుంచి వచ్చి ఆ చేతుల్లోంచి అది లాగేశాను. వీలునామాకాదు-ఉత్తరమూ కాదు. అది మీ ఇద్దరూ కలిసి తీయించుకున్న ఒకనాటి ఫోటో! నిన్నాయన ఎత్తుకుని ముద్దు పెట్టుకుంటున్న ఫోటో. ఇద్దరూ ఎంతో చక్కగా పడ్డారు. ఆ ఫోటో

చూస్తూంటె అప్పటి ఆయనతో యిప్పటి యీ పక్కమీది సర్వస్వం కోల్పోయినట్టున్న ఈయన్ని పోల్చుకుంటే నా దుఃఖం ఆగలేదు. మరో సారి తప్పు చేశాను. గుండె బలహీనంగా ఉన్న వాళ్ళ దగ్గిర ఎప్పుడూ కన్నీరు పెట్టుకోకూడదు. నాతో శృతికలిపి ఆయనా బావురుమన్నారు. ఆ వెక్కిళ్ళు ఓ పట్టాన ఆగలేదు. దాన్తోకలిసి పెద్ద హార్ట్ ఎటాక్ వచ్చేసింది. డాక్టర్‌కి ఫోన్ చేస్తే వెంటనే వచ్చాడు. పెద్ద డోసులో ఏదో ఇంజక్షను ఇచ్చాక ఓ గంటన్నర తరువాత ఆయన ఆయాసం తగ్గి నిద్రలోకి జారుకున్నారు. ప్రమాదం తప్పిపోయిందనీ, పొద్దుటిదాకా మరి లేవరనీ, ఆయన లేచాక తను చెప్పిన క్యాప్సూల్సు యిచ్చి తనకి ఫోన్ చెయ్యమని డాక్టరుగారు వెళ్ళిపోయారు.

ఇంట్లో నిన్ను ప్రేమించిన ఓ మనిషి చావు బ్రతుకుల్లో కొట్టుకుంటున్నా నీకు తెలీదు. నీ గురించే నువ్వు ఆలోచిస్తున్నావు గనక నీ ఆలోచనలకి అందనివి అనేకం. నీ చుట్టుప్రక్కల జరుగుతున్నవేవీ నీకు తెలీదు. చదువుకుని పరీక్షలు ఫస్టుగా ప్యాసయ్యే నీకు నిన్ను పెంచి ప్రేమించిన మనుషుల్నే ఎన్నో పరీక్షలకి గురిచేస్తున్నావని నీకు తెలీదు. ఎందుకు తెలియలేదో తెలుసునా? తెలుసుకుందామని ఏనాడూ నువ్వు ప్రయత్నించలేదు గనక. అలా ప్రయత్నం చెయ్యందే ఏ విషయమూ తనంతట తను వచ్చి నీ ఒళ్ళో పడదు గనక" ఏదో కొత్త విషయం స్ఫురించినట్టు తుళ్ళిపడి లేచికూచుని బుగ్గని చెయ్యి పెట్టుకుని అలా ఎంతసేపో ఉండిపోయానే సుందీ. అప్పుడింకా మా అమ్మ ఏమందో తెలుసా?

"రేపు మీ నాన్న లేస్తారు. లేస్తూనే నీ ఉత్తరం చూస్తారు. చూస్తే ఇంకేముంది? అంతే! ఆయన సేవలో అతృతతో అలసిపోయి ఉన్ననాకు అప్పుడే కునుకుపడుతోంది. నీ అలికిడి విని తెలివివచ్చేసరికి నీ బదులు ఉత్తరం ఉంది. అదృష్టవశాత్తు నా చేతిలో పడింది. కళ్ళజోడు వెతుక్కుని అది చదువుతూంటే – నా హృదయం సలసల మరిగింది. కన్నతల్లికి దూరంగానే కాక పెంచుకున్న తల్లి పెంపకానికయినా నోచుకోని అథపిల్ల-అందులోనూ ఎక్కడా మరొకరి జోక్యం లేకుండా తన చిన్న ఆలోచనా పద్ధతిలోనే ఇంత పెద్ద ప్రపంచం నడుస్తోందనే భ్రమలోనే రూపు దిద్దుకుంటే అది విచ్చలవిడితనంగాక వ్యక్తిత్వం ఔతుందా!"

నా నోటి తడి ఆరిపోయింది. నా కంటి మసక చెదిరిపోయింది. నా కోసం అహర్నిశలు ఆలమటించే వ్యక్తిని మొదటిసారి గుర్తించి ఆత ప్రాణిని గనక సహజంగా నొచ్చుకుంది నా మనసు. అంతమాత్రాన నా వ్యక్తిత్వాన్ని సవాలు చేసే ఎత్తుకి ఎదిగిందా యీ పూర్వకాలపు పిన్ని! తిరగబడ్డాను. నా వాళ్ళుగాని, పీళ్ళుగాని, రేప్రొద్దున నన్ను కట్టుకోవడానికి సిద్ధపడేవాళ్ళు గాని నా వ్యక్తిత్వాన్ని గుర్తించనప్పుడు నేనెందుకిక్కడుండాలి? అదే నిలదీసి అడిగాను.

"అజ్ఞానం ఎన్ని అపార్థాలకైనా దారితీస్తుంది. అదే నిజమని నిర్ణయించుకోవడానికి నీకు అధికారం లేదు. కనీసం అడిగే స్థితికి చేరుకున్నావంటే తెలుసుకునే దారిలో పడ్డట్టే. మొట్టమొదట మీ అమ్మా, నాన్న గురించి చెబుతాను. వాళ్ళ ఆర్థికస్థితి అంత దయనీయంగా ఉన్నప్పుడు ఏ తల్లిదండ్రులయినా ఓ పిల్లని, కనీసం అదైనా సుఖపడుతుందని దత్తత కివ్వడంలో అసహజం, అపరాధం ఏమీలేవు. ఇక పదివేలు ఎందుకు పుచ్చుకున్నారంటావా? 'అమ్ముకోడం' అనే చీటీ నువ్వు అంటిస్తే అది అలా అయిపోదు. అది మీ వాళ్ళు, అంటే మీ అమ్మా నాన్నా కొరుక్కు తినలేదు. దాన్తో పడిపోతున్న వాళ్ళింటిని బాగుచేయించుకున్నారు. అదైనా ఉండబట్టే ఆ కుటుంబం వీధిపాలు కాలేదు! ఇంక ఈయన 'కొనుక్కున్నారని' నువ్వెందుకు అనుకోవాలి? పిల్లలు లేకపోతే ఎడారి అయిన ఆయన బతుకులో మా బావ ఓ అందం, అర్థం అందించాడు. దానికి బహుమానంగా మీ నాన్న ఆ సొమ్ము ఇచ్చి ఉండకూడదా? ఇక నీ కోసం ఇల్లరికం వచ్చే వరులంతా నీ సొమ్ముచూసే వస్తున్నారనే దురాలోచన ముందుగానే ఎందుకుండాలి నీకు? ఇంతకీ నిన్ను ప్రేమించిన మీనాన్న నీ సంసారం, పిల్లలూ తన ముందు ఉండాలనుకోవడంలో తప్పేం ఉంది!"

జవాబు చెప్పలేక నోట్లోంచి మాటరాలేదు నాకు! ఇంట్లోనే ఉండి ఇన్నేళ్ళుగా నే నెరిగిన అమ్మ దగ్గిర కూడా ఇంత రీజనింగుదాగి ఉండడం ఎంత ఆశ్చర్యం!

"ఎందుకే అలా వెర్రిమొహం వేస్తావు. ఇచ్చి పుచ్చుకోడాలు లేకపోతే యీ ప్రపంచం ఏముంది! ఐశ్వర్యమే సర్వస్వమూ అని ఎవరూ అనరుగాని డబ్బుతో ముడిపడని విషయాలు చాలా తక్కువే ఉంటాయి.

లోకంలో భూమ్మీద పుట్టి పెరుగుతున్నందుకు, మన చుట్టూ ఉన్న సంఘంలో విలువలు ధైర్యంగా అంగీకరించలేక - మనకి మనమే ఓ గిరి గీసుకుని అందులోనే ఆలోచిస్తూ, ఏ గమ్యమో మనకే అర్థంకాని ఊహా లోకంలో విహరిస్తూ, అదే వ్యక్తిత్వం అని నువ్వు అనుకుంటే నేనేం చెప్పేది చిట్టీ! ఇంతకీ పెరుగులో కాస్త మీగడ తక్కువయితే మొహం మీద విసిరికొట్టేలా పెరిగిన నువ్వు, రోజుకి అరడజను కాకుండా బట్టలు మార్చి పోగులు పెట్టే నువ్వు, ఒక్కరోజు కారు డ్రైవరు సెలవు పెడితే టాక్సీ ఎక్కే నువ్వు, పంతులమ్మగా సర్దుకుపోయి ప్రత్యేక వ్యక్తిగా జీవితం మొదలుపెడతావా? ఎవరికి వారుగానే రూపుదిద్దుకుంటే మంచిదే. ఇంకొకరి ప్రసక్తి లేకుండా వారి జీవితాన్ని చూసుకుని వారే ఆనందించ వలసి ఉంటుంది! హిమాలయాల ఎత్తు చూస్తే ఎవరైనా ఆశ్చర్యపోయే మాట నిజమే కాని, అంతటి బండరాళ్ళు కరిగి కిందనున్న జీవనదులు నింపి నలుగురికీ ఉపయోగపడితేనే ఎవరైనా ఆనందించేది!"

సుందీ-ఈ ఒక్కముక్కా చాలు నన్ను తప్పుదారి నుంచి మళ్ళించ డానికి. నన్ను నేను తెలుసుకోవడానికి. నా వాళ్ళ కందరికీ అందిరావ డానికి నేనెక్కడికీ పారిపోనక్కర్లేదని తెలుసుకున్నాను. ఇప్పుడు మా నాన్నకి కాస్త నయం. నా యీ మార్పుమీద నీ వ్యాఖ్యకి ఎదురుచూస్తూ -

—కాసులమ్మ.